# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం 1 ఆగస్టు 2025 పేజీలు 8


# 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

- సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన కేటీఆర్
- తన తీర్పు ద్వారా సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యాన్ని కాపాడిందన్న కేటీఆర్
- పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో మరింత విచారణ అవసరం లేదన్న కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** 'సత్యమేవ జయతే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు.

సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. "రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది. పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# విచారణ నివేదికను సమర్పించిన కాళేశ్వరం కమిషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించి విచారణ నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించనున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 ఆఖర్లో కుంగడం, పియర్స్ దెబ్బతినడంతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ

-2 లో





# ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు.. ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం
- ఎర్రవెల్లిలోని తన నివాసంలో సమావేశమైన ముఖ్యమంత్రి
- మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు
- సత్యమేవ జయతే అంటూ బీఆర్ఎస్ ట్వీట్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

**సత్యమేవ జయతే అంటూ బీఆర్ఎస్ ట్వీట్**

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో బీఆర్ఎస్ 'ఎక్స్' వేదికగా స్పందించింది. సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేసింది. తెలంగాణలో ఉప ఎన్నికలు అనివార్యం కానున్నాయని పేర్కొంది.

# ఆ పదిమంది తక్షణమే రాజీనామా చేయాలి: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై రాజయ్య

- ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సభాపతి చర్యలు తీసుకోవాలని డిమాండ్
- చర్యలు తీసుకోకుంటే సుప్రీంకోర్టు వారిని అనర్హులుగా ప్రకటిస్తుందన్న రాజయ్య
- ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్న రాజయ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సభాపతి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని ఆయన స్వాగతించారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మూడు నెలలలోపు స్పీకర్ చర్యలు తీసుకోవాలని, వారిని అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.స్పీకర్ చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టు సుమోటోగా ఆయా ఎమ్మెల్యేలను ఆరేళ్ల వరకు పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుందని తెలిపారు. ఆరేళ్ల వరకు కనీసం వార్డు మెంబర్లుగా కూడా పోటీ చేయడానికి వారు అనర్హులు అవుతారని వ్యాఖ్యానించారు. ఆరు నూరైనా ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల నిర్ణయాన్ని పక్కన పెట్టి అధికార పార్టీలోకి వెళ్లిన వారికి ప్రజలు గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభించాలి

-2లో

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభించాలి

హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో పనులను తక్షణమే పునఃప్రారంభించాలని.. డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో మిగిలిన పనిని పూర్తి చేయాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటిపారుదలశాఖపై సంబంధిత అధికారులతో మంత్రి గురువారం సచివాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్జీఆర్ఐ, జీఎస్ఐతో కలిసి ఎలక్ట్రోమేగ్నటిక్ సర్వేను ఉపయోగించి ఎస్ఎల్‌బీసీ పనులు చేస్తున్నట్లు చెప్పారు. కచ్చితమైన ప్రణాళిక, ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు వీలుగా లైడార్ సర్వే వేగవంతం చేయాలన్నారు. "వానాకాలం పంట కోసం జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రూపొందించాలి. మొత్తం ఆయకట్టుకు నీరు అందేలా చూడాలి. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలి. నీరు లేక రైతులు ఎవరూ ఇబ్బంది పడొద్దు. శాఖ మొత్తం దూరదృష్టితో, జవాబుదారీతనంతో పనిచేయాలి. వర్షాకాలం నేపథ్యంలో యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలి. ఎక్కడా ఎలాంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. వర్షాకాలంలో సంభవించే అతి భారీ వర్షాలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలి. అన్ని జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టాలి. నీటిపారుదలశాఖకు చెందిన భూములు, ఇతర ఆస్తుల్లో ఆక్రమణలు గుర్తించి తొలగించాలి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. స్థానిక మున్సిపల్, పోలీసు శాఖలను సంప్రదించి ఆక్రమణలు తొలగించాలి. డిప్యూటీ ఇంజినీర్లు మొదలు ఇంజినీర్ ఇన్ చీఫ్ స్థాయి వరకు అన్ని స్థాయిల్లో పదోన్నతుల ప్రక్రియ రెండు నెలల్లో పూర్తి చేయాలి"అని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## విచారణ నివేదికను సమర్పించిన కాళేశ్వరం కమిషన్

- మొదటి పేజీ తరువాయి

సమస్యలు ఉత్పన్నమయ్యాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగిలిన బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఏర్పడటంపై విజిలెన్స్ విచారణతోపాటు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్లు విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు వెంటనే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా 2019 నుంచి 2022 వరకు పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. జులై ఆఖరులోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అయితే కమిషన్ ఏర్పాటు ఉత్తర్వులు జస్టిస్ ఘోష్‌కు ఏప్రిల్‌లో అందగా, మే నెల నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడంతోపాటు ఎక్కువ మందిని విచారించాల్సి రావడం, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల పరిశీలన.. ఇలా పలు కారణాలతో కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఇవాళ జస్టిస్ పీసీ ఘోష్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్ రద్దు

**సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు కొట్టివేత**

**అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో సంజయ్‌పై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్**

**ఈ కేసులో ఆయనకు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చిన వైనం**

**దాంతో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన ఏపీ ప్రభుత్వం**




హైదరాబాద్ పెన్ పవర్:ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఆయనకు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో సంజయ్‌పై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఆయనకు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. దాంతో హైకోర్టు తీర్పును ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ ఎన్వీఎన్ భట్టి, జస్టిస్ అమానుతుల్లా ధర్మాసనం ఈ రోజు తీర్పును వెల్లడించింది. ఇక, విచారణ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పుపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్‌ను పూర్తి చేసినట్టు ఉందని మండిపడింది.

## అమెరికన్ల కొంప ముంచుతున్న ట్రంప్ టారిఫ్స్.. ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు లాస్..!



హైదరాబాద్ పెన్ పవర్:ఐఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాను అనుకున్న విధంగా ప్రపంచంలోని అనేక దేశాలపై వరుసగా పన్నులు ప్రకటిస్తూనే ఉన్నారు. తన మాట కాదని తమ దేశంతో వ్యాపారానికి అంగీకరించని దేశాలపై చాలా సీరియస్ గా ఉన్నాడు ట్రంప్. అయితే ట్రంప్ తీసుకొస్తున్న టారిఫ్స్ ఇతర దేశాలతో పాటు తమ పౌరులకు కూడా పెద్ద ప్రమాదాన్ని కలిగించనున్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. ట్రంప్ మెగా టారిఫ్స్ అమెరికన్లపై భారాన్ని మోపుతాయని ఏల్ యూనివర్సిటీ రీసెర్చ్ నివేదిక చెబుతోంది. దక్షిణ కొరియా, ఇండియా లాంటి స్నేహితులపై కూడా ట్రంప్ భారీ సుంకాలు అక్కడి ప్రజల గృహ ఖర్చులను పెంచటంతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థ నెమ్మదించేలా చేస్తాయని పేర్కొంది. ట్రంప్ ప్రపంచ దేశాలపై విధిస్తున్న టారిఫ్స్ కారణంగా స్వల్ప కాలంలో ఒక్కో అమెరికన్ ఇంటి ఆదాయం 2వేల 400 డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.2లక్షల వరకు నష్టపోతారని తేల్చింది ఏల్ రిపోర్ట్.1930 తర్వాత అమెరికా ఇంత భారీ స్థాయిలో సుంకాలు విధించటం ఇదే తొలిసారిగా ఏల్ పేర్కొంది. ప్రధానంగా ట్రంప్ చర్యలు అమెరికాలోని అప్పాదాయ వర్గాలను ప్రభావితం చేయనుందని తేలింది. పేదలపై మరింత మోయలేని భారం పడనుందని రిపోర్ట్ చెబుతోంది. అల్పాదాయ వర్గాల కుటుంబాలు సగటున వెయ్యి 300 డాలర్లు నష్టం వాటిల్లనుందని రిపోర్ట్ చెప్పగా.. ఇక అధిక ఆదాయ వర్గాలు 5వేల డాలర్లు అంటే రూ.4 లక్షల వరకు నష్టపోనున్నట్లు తేల్చింది. ట్రంప్ తెస్తున్న సుంకాలు అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయటంతో పాటు ద్రవ్యోల్బణం పెరుగుదల, నిరుద్యోగిత పెరుగుదలకు దారితీస్తుందని వెల్లడైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 0.5 శాతం తగ్గటంతో పాటు ఏడాది చివరి నాటికి 5లక్షల మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వెల్లడైంది. మరో పక్క యూఎస్ ట్రెజరీకి ట్రంప్ టారిఫ్స్ కారణంగా 167.7 బిలియన్ డాలర్లు అంటే రూ.14 లక్షల కోట్లకు పైగా ఆదాయాన్ని తెచ్చిపెడుతుందనే అంచనాలు ఉన్నాయి.

## ఓ టీచర్ చేయాల్సిన పనేనా ఇది..చిన్నారి ప్రైవేట్ పార్ట్స్‌పై ఏం చేసిందో చూడండి



హైదరాబాద్ పెన్ పవర్:ముంబైలోని నల్లసోపారాలో షాకింగ్ ఘటన..స్కూల్లో 8ఏళ్ల విద్యార్థిపై టీచర్ అమానుష దాడి..విద్యార్థి ప్రైవేట్ పార్ట్స్?లో కోలిన్ స్ప్రే చేసింది. ఈ దురదృష్టకర,అమానవీయ చర్య స్థానికుల్లో దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రజలు,మీడియా ఈ ఘటనను ఖండిస్తూ సమాజంలో మరింత కఠినమైన చట్టాల అవసరాన్ని డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

జూలై 23న ఈ ఘటన జరిగింది. ముంబై సమీపంలోని నల్లసోపారాలో హెూవార్డ్ ఇంగ్లీష్ స్కూల్‌కు చెందిన నిదా నిజాముద్దీన్ అనే ఉపాధ్యాయురాలు ఈ దారుణానికి పాల్పడింది. విద్యార్థినుంచి దుర్వాసన వస్తుందనే ఫిర్యాదు మేరకు 8 ఏళ్ల బాలుడి ప్రైవేట్ భాగంలో కాలిన్ స్ప్రే చేసింది. అనే ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ లో ఈ మొత్తం సంఘటనను షేర్ చేయడంతో వైరల్ అయింది. ఇంటర్నెట్‌లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది.ఈ సంఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు, స్థానికులు ఫిర్యాదు చేశారు. టీచర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్పందించిన రాష్ట్ర విద్యా శాఖ దర్యాప్తులో టీచర్ విద్యార్థిపై అనుమానుష దాడికి పాల్పడినట్టు రుజువైంది. ఈ ఘటనతో హెూవార్డ్ ఇంగ్లీష్ స్కూల్ రాష్ట్ర విద్యా శాఖ దృష్టికి వచ్చింది. స్కూల్ ను వెంటనే మూసివేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ స్కూల్ పై గతంలో కూడా ఆరోపణలు ఉన్నాయి. ఆ స్కూల్ ఔరంగాబాద్ లోని వేరే స్కూల్ నుండి లీవింగ్ సర్టిఫికేట్ (%బాజ%) జారీ చేస్తోందని తేలడంతో హెూవార్డ్ స్కూల్ రిజిస్ట్రేషన్ ,చట్టబద్ధత గురించి తీవ్రమైన ఆందోళనలు వెల్లువెత్తాయి.

**నెటిజన్లు ఏమంటున్నారంటే..**

టీచర్ చర్యను నెటిజన్లు తీవ్రంగా ఖండించారు. విద్యార్థి భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. “ఉపాధ్యాయులు ఎలా ఆలోచిస్తారో ,ప్రవర్తిస్తారో అతను అలా ఉంటే..వారు ఆ వృత్తిలో పనిచేసేందుకు అర్హులు కాదు” అని ఓ నెటిజన్ రాశారు. స్థానికుడైన ఇన్‌స్టాగ్రామ్ యూజర్ ఇలా వ్రాశాడు.. హెూవార్డ్ స్కూల్ మా ప్రాంతంలో ఉంది.. అది ఒక నివాస భవనంలో నిర్వహిస్తున్నారు. దానిని పాఠశాలగా ఎలా గుర్తించారో తెల్వట్లేదు అని రాశారు.

## భారీ భూకంపం, సునామీ తర్వాత రష్యాలో పేలిన అగ్నిపర్వతం!

హైదరాబాద్ పెన్ పవర్:రష్యాను బుధవారం భారీ భూకంపం వణికించిన సంగతి తెలిసిందే. రిక్టర్ స్కేల్ పై 8.8 తీవ్రత నమోదైన ఈ భూకంపంవల్ల రష్యాతోపాటు జపాన్, అమెరికా, హవాయ్ దీవుల్లో సునామీ వచ్చింది. ఆ సమయంలో సముద్ర తీరంలో అలలు భారీ ఎత్తున ఎగసిపడ్డాయి. అటు భూకంపం, ఇటు సునామీతో రష్యా వణికిపోగా.. ఆ తర్వాత యురేషియాలో అత్యంత చురుకైన, ఎత్తైన క్లూచెస్కోయ్ అగ్నిపర్వతం విస్ఫోటనం చెందిందిఅవును... రష్యాలోని మారుమూల కమ్చట్కా ద్వీపకల్పాన్ని 8.8 తీవ్రతతో భూకంపం కుదిపేయడం.. ఆ సమయంలో రష్యాతో పాటు ప్రధానంగా జపాన్, అమెరికాల్లో సునామీ రావడం.. కొన్ని లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోవడం జరిగింది. ఈ సమయంలో... అత్యంత చురుకైన క్లూచెస్కోయ్ అగ్నిపర్వతం విస్ఫోటనం చెందింది. దీంతో... పసిఫిక్ అంతటా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి.ఇలా అతిపెద్ద క్రియాశీల అగ్నిపర్వతం నుండి లావా ప్రవహించడం ప్రారంభమైందని రష్యన్ రాష్ట్ర వార్తా సంస్థ నివేదించింది. కమ్చట్కా ద్వీపకల్పంలో ఉన్న క్లూచెస్కోయ్ 4,750 మీటర్ల ఎత్తు కలిగి ఉన్న అగ్నిపర్వతం నుంచి నారింజ రంగులో మంటలు ఎగసిపడుతున్నట్లు తెలిపింది.

# ‘అయ్యో.. రొయ్య’... ట్రంప్ సుంకాల ఎఫెక్ట్ ఏపీలో ఎంతంటే..! ఈ నేపథ్యంలో... రైతు



హైదరాబాద్ పెన్ పవర్:ఆగస్టు 1 నుంచి భారత్ ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే.. ప్రస్తుతం అమలులో ఉన్న 10 శాతం సుంకాలకు ఇది అదనమా.. లేక, దీనితో కలిపే 25 శాతమా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని అంటున్నారు. మరోవైపు... 'జరిమానాలు' అదనం అని ప్రకటించిన నేపథ్యంలో.. అవి ఏ మేరకు ఉంటాయనే ఆందోళనలు నెలకొన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావంపై అధ్యయనం చేస్తున్నట్లు భారత ప్రభుత్వం తెలిపింది. ఈ సందర్భంగా... జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో... రైతులు, వ్యాపారవేత్తలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొంది. ఈ సమయంలో... రొయ్యల ఎగుమతులపై తీవ్ర ప్రభావం ఉండొచ్చని అంటున్నారు.అవును... ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్న అమెరికా 25 శాతం సుంకం, అదనంగా జరిమానా విధించడం వల్ల భారతదేశ సముద్ర ఆహారం ఎగుమతులు, ముఖ్యంగా రొయ్యలు తీవ్రంగా ప్రభావితమవుతాయని వ్యవసాయ ఆర్థికవేత్త అశోక్ గులాటి అన్నారు. అన్ని భారతీయ వస్తువులపై అధిక సుంకం విధించాలనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం చాలా చెడ్డదని.. అది కచ్చితంగా షాకింగ్ నిర్ణయమని గులాటి అన్నారు.

వాస్తవానికి అమెరికా సుంకాల అమలు నిర్ణయం 10 నుంచి 15 శాతం మాత్రమే ఉంటుందని తాను భావించినట్లు చెప్పిన గులాటీ... తాజా చర్య దేశ రొయ్యల ఎగుమతులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని అన్నారు. ఇదే సమయంలో ట్రంప్ పాతిక శాతం సుంకాలు ం అదనపు జరిమానా వ్యవహారం.. రొయ్యల ఎగుమతులతో పాటు, వస్త్రాల ఎగుమతులపైనా ప్రభావాన్ని భారతదేశం చూస్తుందని తెలిపారు. కాగా... 2024-25లో భారతదేశ రొయ్యల ఎగుమతులు సుమారు 4.88 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీంతో... ఇది మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో 66 శాతం వాటా కలిగి ఉందని అంటున్నారు. మరోవైపు... భారత రొయ్యలకు అమెరికా, చైనా అగ్ర మార్కెట్లుగా ఉండగా.. ముడి రొయ్యల రకాల ఎగుమతి పరిమాణంలో సుమారు సగం అమెరికా తీసుకుంటోంది!

**ఆంధ్రప్రదేశ్ కు బిగ్ ఎఫెక్ట్!:**

తాజాగా ట్రంప్ ప్రకటించిన 25% సుంకాల ప్రభావం ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడుల్లోని రొయ్యల ఎగుమతులపైనా పడనుందని అంటు న్నారు. వాస్తవానికి భారత్ నుంచి ఏటా 11 లక్షల టన్నుల రొయ్యలు ఎగుమతి అవుతుంటే.. అందులో సుమారు ఎనిమిది లక్షల టన్నులు ఆంధ్రప్రదేశ్ నుంచే ఎగుమతి అవుతున్నాయని చెబుతున్నారు. ఇదే సమయంలో.. ఏపీ నుంచి ఎగుమతయ్యే రొయ్యల్లో 70 శాతం అమెరికాకే వెళ్తాయని అంటున్నారు.

# హైవేపై వాహనాలు నడుపుతున్నారా.. ఇదొక్కసారి చదవండి! హైవేలపై వాహనాలు రయ్



హైదరాబాద్ పెన్ పవర్:హైవేలపై వాహనాలు రయ్ రయ్ మంటూ దూసుకుపోతుంటాయనే సంగతి తెలిసిందే. టోల్ వచ్చినప్పుడు తప్ప మరెక్కడా వాహనాన్ని స్లో చేయాల్సిన అవసరం లేదనే ధైర్యంతోనో, నమ్మకంతోనో వాహదారులు దూసుకుపోతుం టారు. అదే నమ్మకంతో వారి వెనుక వచ్చేవారూ వస్తుంటారు. ఈ సమయంలో సడన్ గా బ్రేక్ వేస్తే.. వెనుక వరుస ప్రమాదాలు జరుగుతాయి! ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇలాంటి ఓ సంఘటనపై ఆసక్తికర తీర్పు వెలువరించింది.

అవును... 2017లో తమిళనాడులో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ పై వెళ్తున్న ఓ వ్యక్తి ఎడమ కాలు కోల్పోయారు. ఆ పరిస్థితికి దారితీసిన నిర్లక్ష్యానికి పాల్పడిన కారు డ్రైవర్ ను ఉద్దేశించి.. హైవేలపై డ్రైవింగ్ చేసేవారు మధ్యలో ఆపాలని అనుకుంటే.. వెనుక ఉన్న వాహనాలకు హెచ్చరిక సిగ్నల్స్ ఇవ్వాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా... భారీ పరిహారాన్ని చెల్లించాలని వెల్లడించింది! వివరాల్లోకి వెళ్తే... జనవరి 7, 2017న హక్కిం అనే వ్యక్తి తన స్నేహితుడితో కలిసి మోటార్ సైకిల్ పై వెళు తున్నాడు. సరిగ్గా ఆ సమయంలో వారి ముందున్న కారు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో.. హక్కిం మోటార్ సైకిల్ కారును ఢీకొట్టి రోడ్డు కుడి వైపున పడిపోయింది. ఆ సమయంలో అతనిపై నుంచి ఒక బస్సు దూసుకెళ్లింది. దీంతో... చికిత్స సమయంలో వైద్యులు అతని ఎడమ కాలును తొలగించాల్సి వచ్చింది.

ఈ సమయంలో... అప్పీలుదారుడు కదులుతున్న కారును వెనుక నుండి ఢీకొట్టాడంటూ కారు బీమా సంస్థ తన వాదనను వినిపించింది.. అందువల్ల కారు డ్రైవర్ బాధ్యత వహించదని తెలిపింది. మరోవైపు.. తన భార్య గర్భవతి కావడంతో ఆమెకు వాంతులు వచ్చినట్లు అనిపించడంతో తాను అకస్మాత్తుగా బ్రేక్ లు వేసినట్లు కారు డ్రైవర్ తన సాక్ష్యంలో అంగీకరించాడు. ఈ వాదనలు విన్న సుప్రీంకోర్టు... తమ అభిప్రాయం ప్రకారం అప్పీలుదారుడు ముందుకు కదులుతున్న వాహనం నుండి తగినంత దూరం నిర్వహించకపోవడం, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా మోటార్ సైకిల్ ను నడపడంలో ఖచ్చితంగా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని కనుగొనడం సరైనదేనని పేర్కొంది. అలాగే... ప్రమాదానికి ప్రధాన కారణం కారు డ్రైవర్ వేసిన సడన్ బ్రేకులు అని తెలిపింది.

ఇదే సమయంలో... హైవే మధ్యలో తన కారును అకస్మాత్తుగా ఆపినందుకు కారు డ్రైవర్ ఇచ్చిన వివరణ ఏ కోణం నుండి చూసినా సహేతుకమైంది కాదని.. హైవేలో వాహనాల అధిక వేగంతో వెళ్తాయని.. ఆ సమయంలో డ్రైవర్ తన వాహనాన్ని ఆపాలని అనుకుంటే, రోడ్డుపై వెనుక కదులుతున్న ఇతర వాహనాలకు సిగ్నల్ ఇవ్వాల్సిన బాధ్యత అతనిపై ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో... మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఏసీటీ) పరిహారాన్ని రూ.91.62 లక్షలుగా నిర్ణయించింది. అయితే... ఇందులో హక్కిం నిర్లక్ష్యాన్ని పరిగణలోకి తీసుకున్న తర్వాత ఆ పరిహారాన్ని 20% తగ్గిస్తూ... దానిని రూ.73.29 లక్షలకు ఫైనల్ చేసింది! ఇందులో కారు బీమా సంస్థ 50%, బస్సు బీమా సంస్థ 30% వరకు చెల్లించాలని తెలిపింది!

# పాలేరు విద్యాభివృద్ధికి 470 కోట్లు

- "పేద పిల్లలను మణిరత్నాలుగా తీర్చిదిద్దుతాం"
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ పెన్ పవర్:**పాలేరు నియోజకవర్గంలో విద్యా రంగానికి కొత్త ఊపు తెచ్చేందుకు 470 కోట్ల రూపాయలను విద్యాభివృద్ధి కోసం కేటాయించామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. "పేద పిల్లలు చదువులో వెనుకబడకూడదు%ొ% వారిని మణిరత్నాలుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ సంకల్పం" అని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**జూనియర్ కళాశాలకు శంకుస్థాపన**

కూసుమంచి పాత జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. "ఈ భవనాన్ని డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి ఈ ఏడాదిలోనే విద్యార్థుల కోసం ప్రారంభిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం నాకు గర్వంగా ఉంది" అని మంత్రి అన్నారు.

**76 మంది బాలికలకు సైకిళ్లు**

పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న 76 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. "పేద పిల్లలకు ప్రయాణ సౌకర్యం లేక చదువులో వెనుకబడకూడదు. గతేడాది 8, 9, 10వ తరగతుల విద్యార్థినిలు అందరికీ సైకిళ్లు ఇచ్చాం. వచ్చే ఏడాది నుంచి జూనియర్ కళాశాలలో చేరుతున్న విద్యార్థినిలకు కూడా సైకిళ్లు అందిస్తాం" అని తెలిపారు.

**లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు**

ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. "పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ పథకాలను కొనసాగిస్తున్నాం. భవిష్యత్తులో కూడా పేదల కోసం ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం జరుగుతాయి" అని ఆయన స్పష్టం చేశారు.

**విద్యా రంగానికి 470 కోట్ల రూపాయలు**

"గడచిన 18 నెలల్లో పాలేరు నియోజకవర్గానికి 470 కోట్ల రూపాయల నిధులు విద్యాభివృద్ధికి కేటాయించాం. ఐటీఐ, నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి కొత్త శకం తెస్తాయి. చదువు అందరికీ చేరేలా ప్రభుత్వ కృషి కొనసాగుతుంది" అని మంత్రి వివరించారు.

**వ్యక్తిగతంగా సహాయం చేస్తానని హామీ**

"ప్రభుత్వ సహాయంతో పాటు అవసరమైతే నేను కూడా వ్యక్తిగతంగా సాయం అందించేందుకు పేద విద్యార్థులకు అండగా ఉంటాను. స్కూల్ అభివృద్ధి కోసం అవసరమైతే స్వయంగా నిధులు సమకూరుస్తాను. ప్రతి విద్యార్థి మంచి చదువులు చదివేలా నా వంతు కృషి చేస్తాను" అని మంత్రి హామీ ఇచ్చారు.

**విమర్శలపై ఘాటు వ్యాఖ్యలు**

"పూర్వ ప్రభుత్వ పరిపాలన వల్లే ఈ దౌర్భాగ్య పరిస్థితి వచ్చింది. ఇప్పుడు పిల్లల భవిష్యత్తు కోసం బాధ్యత తీసుకుని, ప్రతి విద్యార్థిని సమాజంలో ఒక ఆభరణంగా తీర్చిదిద్దే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుందని మంత్రి వ్యాఖ్యానించారు.

# స్మార్ట్ సిటీ మిషన్ గడువును జూన్ 2026 వరకు పొడిగించాలి :ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రజాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని స్మార్ట్ సిటీ పనులు పూర్తయ్యే వరకు మిషన్ గడువు పెంచాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రేటర్ వరంగల్, కరీంనగర్ నగరాల్లో ఇంకా పూర్తి కాకపోయిన పనుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వరంగల్ నగరంలో కొన్ని పనులు పూర్తయ్యేలోపు స్మార్ట్ సిటీ మిషన్ గడువు ముగిసి పోయిందని దీంతో నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు అందడంలేదనన్నారు.

ఈ నేపథ్యంలో స్మార్ట్ సిటీ మిషన్ గడువును జూన్ 2026 వరకు పొడిగించాలని అన్నారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి టోకెన్ సాహు రాతపూర్వక సమాధానంలో వివరాలు వెల్లడించారు. స్మార్ట్ సిటీస్ మిషన్ ఇప్పటికే మార్చి 31, 2025న ముగిసిందని, ఇకపై పొడిగింపు ఉండదని తెలిపారు. ఇంకా మిగిలిన పనులను ప్రతి నగరంలో ఉన్న ప్రత్యేక సంస్థలు (%ూ్రాం%) ద్వారానే పూర్తి చేయాలని తెలిపారు.

ప్రస్తుతానికి గ్రేటర్ వరంగల్‌లో రూ.1,800 కోట్లలో రూ.1,386 కోట్ల విలువైన 119 పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.415 కోట్లతో 40 పనులు జరుగుతున్నాయి. కరీంనగర్‌లో రూ.1,094 కోట్లలో రూ.979 కోట్ల విలువైన 49 పనులు పూర్తయ్యాయి. రూ.115 కోట్లతో 12 పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ..స్మార్ట్ సిటీ ద్వారా పట్టణ అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలియజేశారు. మిషన్ గడువు పూర్తి అయినప్పటికీ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయం అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం నగరాల్లో మిగిలిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.


## ఫుట్ పాత్ పై షెడ్ తొలగించాలని మెమో రాండం.

- జూనియర్ కాలేజీ గ్రౌండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన షెడ్డు నిర్మాణం తొలగించాలి.
- సెప్టిక్ ట్యాంక్ ను కబ్జా చేశారని ఈవో కి విన్నవించిన నాయకులు.
- సమస్యను పరిష్కరిస్తానని తెలియజేసిన గ్రామపంచాయతీ ఈవో.
- ఈవో దృష్టికి తీసుకెళ్లిన ఆటో యూనియన్ జేఏసీ వివిధ సంఘాల పార్టీల నాయకులు



**హైదరాబాద్ పెన్ పవర్:**భద్రాచలం పట్టణం లోని కాలేజ్ గ్రౌండ్ ఎదురుగా గ్రామ పంచాయతీ భద్రాచలం వారు టాయిలెట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు దాన్ని పక్కనే సెప్టిక్ ట్యాంక్ పైన కొంత మంది కబ్జా చేసి షెడ్ నిర్మాణం చేసి వ్యాపారం చేస్తున్నారని పలు ప్రజా సంఘాల పార్టీల నాయకులు ఆటో యూనియన్ జెఎసి నాయకులు ఈవో దృష్టికి తీసుకెళ్లారు గత 30 సంవత్సరాలకు పైచిలుకు ఆటో స్టాండ్ నిర్మాణం ఉందని ఆ ఆటో అడ్డాని నమ్ముకొని వందల మంది కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారని దాని పక్కనే ఈమధ్య కాలంలో గ్రామపంచాయతీ వారు టాయిలెట్స్ రూములు ఏర్పాటు చేశారని దాని పక్కన సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం ఉన్న దానిపైన కొంతమంది కబ్జాదారులు ఆర్థికంగా స్థిరపడిన వాళ్లు రేకుల షెడ్డు ఏర్పాటు చేసి ఫ్రూట్స్ వగైరా వ్యాపారం చేస్తున్నారని ఈవో దృష్టికి తీసుకెళ్లారు అంతేకాకుండా టాయిలెట్స్ పక్కనే ఫ్రూట్స్ అమ్మడం వలన ఈగలు దోమలు ఆ పండ్ల పైన వాడుతున్నాయని ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని వారు ఈవో దృష్టికి తీసుకెళ్లారు ప్రజలు అక్కడ ఆగి ఆటో ఎక్కే పరిస్థితి ఉందని వాళ్లని కూడా ఎక్కనియ్యకుండా చేస్తున్నారని తక్షణమే ప్రభుత్వ భూమి ఫుట్ పాత్ సెప్టిక్ ట్యాంక్ ను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని వారు గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసుని కోరారు గ్రామపంచాయతీ ఈవో స్పందించి పరిశీలించి సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాన్ని తీసే విధంగా చర్యలు చేపడతానని వారికి హామీ ఇచ్చారు ఈ మెమోరాండం ఇచ్చిన వారిలో ఆటో యూనియన్ జేఏసీ ప్రెసిడెంట్ శంకర్ వివిధ ప్రజా కుల పార్టీ నాయకులు పూనెం కృష్ణ దొర మునిగేళ్ల శివ ప్రసాద్ శెట్టి రాజారత్నం పూ నెం ప్రదీప్ సాధన పల్లి సతీష్ పెళ్ళాం నరేష్ ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఔషధ గని అదే మన మహేంద్ర గిరి




**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీకాకుళం జిల్లా మందస-ఒరిస్సా సరిహద్దులలోనీ దట్టమైన అటవీప్రాంతంలో కనిపించే ఎత్తు అయిన పర్వతం మహేంద్రగిరి.ఇక్కడ అడవుల్లో ఏనుగులు ,పులులు,జింకలు, నెమలలు,కొండచిలువలు అనేకరకాల జంతువులు కనిపిస్తాయి.ఇక్కడ అనేకరకాల ఔషధ వృక్షాలు ఉన్నాయి. దాదాపు 1200 వృక్ష జాతులు కు చెందిన ఔషధ వన మూలికలు ,మొక్కలు ఉన్నట్లు ఒడిశా జీవవైవిధ్య మండలి అధ్యయనంలో తేలిందని పలువురు చెబుతున్నారు. ఈ ఔషధ వృక్ష జాతి వల్ల మానవ శరీరంలో చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని చెబుతున్నారు.

## డాక్టర్ లక్ష్మన్న దశదిన కర్మకు హాజరైన వలిగొండ మండల ప్రజలు అభిమానులు.



హైదరాబాద్ పెన్ పవర్:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో డాక్టర్ లక్ష్మన్న సేవలు మరువలేనివి ఆయన 1980 సంవత్సరం అప్పటి టైములో ఆర్ఎంపీ డాక్టర్లు మాత్రమే ఉండేవారు అప్పుడు ఎంబిబిఎస్ చదువు చదివి మండల కేంద్రంలో హాస్పిటల్ ప్రారంభించి ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండే మహోన్నతమైన వ్యక్తి అని మండల ప్రజలు కొనియాడినారు .వడిగొండ మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి ఒక ఫ్యామిలీ డాక్టర్ వలె ఉన్న వ్యక్తి అనారోగ్యం కారణం వలన ఆయన మృతిచెందినారు.

వారి దిశ దిన కర్మకు ఈరోజు వలిగొండ మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి అభిమానులు మండల నాయకులు ఓలిగొండ మండల ప్రజలు అధిక సంఖ్యలో హైదరాబాదులోని ఎం కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో డాక్టర్ లక్ష్మన్న దిశదినకర్మ లో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మన్న కుటుంబ సభ్యులు కొడుకులు కోడళ్ళు మనుమలు మనుమరాలు మండల ప్రజలు అభిమానులు అధిక సంఖ్యలో అధిక సంఖ్యలో పాల్గొని అనే చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.

## తిరుమల యాత్రికులకు అల్పాహారం వితరణ



హైదరాబాద్ పెన్ పవర్: తమిళనాడు క్రిష్ణగిరి కి చెందిన పాదయాత్రికులు తిరుమలకు వెళుతూ పలమనేరు మార్గమధ్యంలో పలమనేరు కు చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ నేషనల్ సెక్రెటరీ ద్వారా పూల గుచ్చం మరియు అల్పాహార ప్యాకెట్లను అందుకున్నారు.


ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ తిరుమల యాత్ర అతి పవిత్రం అని ఇటువంటి యాత్ర చేసే సందర్భంలో భక్తులకు బాసటగా నిలిచిన మధుమోహన్రావు సేవలు అమోఘమని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

మధుమోహన్రావు మాట్లాడుతూ వేలకొద్ది సేవా కార్యక్రమాలు చేశానని దేవుడు నాకు శక్తి ఇచ్చినన్ని రోజులు సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు

ఈ కార్యక్రమంలో తిరుమల పాదయాత్రికులు మరియు సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్రావు పాల్గొన్నారు

# జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి ఎలా ఉంది..?

- పెండింగ్ లో ఉన్న హైవే విస్తరణ పనుల పూర్తికి తీసుకుంటున్న చర్యలేంటి..?
- ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా ఇచ్చిన కనెక్షన్లు ఎన్ని..?
- 2020 నుంచి చిన్న పరిశ్రమల మూసివేతకు కారణాలను గుర్తించారా..?



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణతో సహ ఇతర రాష్ట్రాల్లో జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి ఎలా ఉంది? అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా.. గురువారం మూడు అంశాలపై ప్రశ్నించారు. జాతీయ రహదారులతో పాటు.. ప్రధానమంత్రి ఉజ్వల యోజన ( పీఎంయువై ) కనెక్షన్లు, సూక్ష్మ మరియు మధ్యస్థ పరిశ్రమల మూసివేతకు కారణాలపై ప్రశ్నించారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం మరియు సహజ వాయువుల శాఖల సహాయ మంత్రి సురేష్ గోపి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే లు వేరువేరుగా లిఖిత పూర్వక సమాధానాలు ఇచ్చారు.

జాతీయ రహదారులకు సంబంధించి.. సంబంధిత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ.. భారత్ మాల పరియోజనలో భాగంగా.. 2017లో దేశవ్యాప్తంగా 34,800 కి. మీ. జాతీయ రహదారుల నిర్మాణాన్ని రూ. 5.35 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇందులో 20,070 కి. మీ ఇప్పటికే నిర్మించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 1,719 కి. మీ. మేరా నిర్మాణాలకు గాను.. 874 కి. మీ. పూర్తయినట్లు చెప్పారు. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్నిచోట్లా సకాలంలో పూర్తి చేస్తామని వివరించారు.

ప్రధానమంత్రి ఉజ్వల యోజన ( పీఎంయువై) పురోగతిపై కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి.. సమాధానమిస్తూ.. పేద వయోజన మహిళలకు డిపాజిట్ రహిత ఎల్ పీ జీ కనెక్షన్లను అందించే లక్ష్యంతో 2016 లో ప్రారంభించామని, 8 కోట్ల కనెక్షన్ల లక్ష్యాన్ని సెప్టెంబర్ లో సాధించామని తెలిపారు. మిగిలిన అర్హులైన పేదల కోసం.. 2021లో చేపట్టిన ఉజ్వల 2.0 ద్వారా 2022 డిసెంబర్ లో 1.60 కోట్ల కనెక్షన్ లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీ నాటి గణాంకల ప్రకారం 10.33 కోట్ల పీఎంయువై కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని మహిళలు కట్టెల పొయ్యిని వీడేలా చేసి, శ్వాసకోశ ఇబ్బందులను దూరం చేసి, వారి జీవితాల్లో ఈ పథకం గణనీయ ప్రభావం చూపిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2019–20 లో 1,48,480 కనెక్షన్లు, ఉజ్వల 2.0 కింద 2023– 24 లో 32,890, ఈ ఏడాది ఇప్పటివరకు 336 కనెక్షన్లు మంజూరు చేసినట్లు వివరించారు.సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే సమాధానం ఇస్తూ... సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల ( ఎంఎస్ఎంఈ ) రిజిస్ట్రేషన్ పోర్టల్ 2020లో ప్రారంభమైనట్లు తెలిపారు. పరిశ్రమలు, సంస్థల ద్వారా..దేశ వ్యాప్తంగా 28.49కోట్ల మంది ఉపాధి,ఉద్యోగ అవకాశాలు పొందారని, తెలంగాణకు సంబంధించి 2020– 21 లో 1.63 లక్షల మంది, 2025 –26కు సంబంధించి 1.23 లక్షల మంది ఉన్నట్లు గణాంకాలు తెలిపారు. జిడిపిలో ఎగుమతి వాటా 2023 –24 లో 45. 73 శాతం ఉందని, నకిలీ రిజిస్ట్రేషన్, కంపెనీ యజమాని మార్పు.. తదితర కారణాలతో 0.15 శాతం చిన్న తరహా పరిశ్రమలు మూతపడినట్లు వివరించారు.

# ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రజలు సామాజిక బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- జ్వరం లక్షణాలు ఉంటే ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి
- కూసుమంచి మండలం కేంద్రంలోని, ఆయుర్వేద, యునానీ, హెూమియో ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

హైదరాబాద్ పెన్ పవర్:ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు పని చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

గురువారం కూసుమంచి మండలం కేంద్రంలోని ఆయుర్వేద, యునానీ, హెూమియో ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ.పి. సేవలు, మందుల అందుబాటు, సూచిక బోర్డు, వైద్య సేవలు, ల్యాబ్ రికార్డ్స్, మెడికల్ ఫార్మసి, ప్రసూతి కాన్పుల గది, అపరేషన్ థియేటర్ పరిశీలించారు. డాక్టర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.

ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డాక్టర్లు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. రోజుకు ఎన్ని ఓ.పి. లను చూస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యం పై సమగ్రంగా వివరాలు తెలిపి మందులు వాడే పద్ధతిని వివరించాలని, వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.

గర్భిణీల కాన్పుల గదిలో కావాల్సిన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించి, ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు దృష్టి పెట్టాలని వైద్యులకు సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల, ఆవరణంలో పిచ్చి మొక్కలు, చెత్త లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, తదితర వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా కేసులు తప్పనిసరిగా రిపోర్ట్ అయ్యేలా చూడాలని తెలిపారు.

ఆసుపత్రిలో అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు.



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ వైద్య కేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవల నాణ్యతతో పాటు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావలసిన పరికరాలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై నివేదికల సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ తనిఖీ సందర్భంగా కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, వైద్యాధికారులు డా. సాయికుమార్, డా. లక్ష్మీలోహిత, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# సమాచార హక్కు చట్టం ప్రజల ప్రాథమిక హక్కు...




- ప్రజలకు ప్రభుత్వానికి జవాబుదారీ తనంగా అధికారులు ఉండాలి..
- సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి.

**హైదరాబాద్ పెన్ పవర్:**సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని, ప్రజల హక్కును కాపాడటానికి అధికారులు ప్రజలకు ప్రభుత్వానికి జవాబు దారితనంగా వారధిలా నిలువాలని సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమాచార హక్కు చట్టం ( ఆర్టిఐ ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రధాన కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి, సహ కమిషనర్లు దేశాల భూపాల్ మరియు పి.వి. శ్రీనివాస్ రావు గురువారం జిల్లాకు విచ్చేశారు. జిల్లాకు విచ్చేసిన కమిషనర్లకు ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మరియు జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ సౌరబ్ శర్మ పూల మొక్కలు ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం ప్రధాన కమిషనర్ బోరేటి అయోధ్య రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఐ డి ఓ సి కార్యాలయం ప్రాంగణంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కమిషనర్లు మొక్కలు నాటారు.

జిల్లాలో సమాచార హక్కు చట్టం కమిషనర్ల పర్యటన నేపథ్యంలో ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరం లో ఆర్.టి.ఐ యాక్ట్ అమలు చేయు విధివిధానాలపై క్షుణ్ణంగా పౌర సమాచార అధికారులకు చట్టనిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్ర ముఖ్య పౌర సమాచార కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి మరియు ఇతర కమిషనర్లు పి.వి శ్రీనివాసరావు, దేశాల భూపాల్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మరియు ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఐ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రావడం జరిగిందని సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ మరియు వివిధ శాఖల అధికారులు చూపించిన చొరవ హర్షించదగ్గ విషయం అని అన్నారు. సమాచార హక్కు చట్టం 136 దేశాల్లో అమలు అవుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్టిఐ సమర్థవంతంగా అమలవుతుందన్నారు. సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అవినీతి నిర్మూలన లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది అన్నారు. ఈ చట్టంలోని సెక్షన్లు, సబ్ సెక్షన్ లపై పౌర సమాచార అధికారులు చదివి సమగ్ర అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న 29 ప్రభుత్వ శాఖల్లో 15 శాఖల్లో ఎటువంటి కేసులు లేకపోవడం హర్షించదగ్గ విషయంగా ఆయన పేర్కొన్నారు. 136 దేశాల్లో ఆర్టిఐ యాక్ట్ అమల్లో ఉందన్నారు. ప్రపంచంలోనే భారతదేశం 8వ స్థానంలో ఉందని, రాబోయే రోజుల్లో మొదటి స్థానానికి రావాలని అదేవిధంగా దేశంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిపే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబు గారితనం ఎంత అవసరమో పారదర్శకత కూడా అంతే అవసరమని ఆర్టిఐ యాక్ట్ ద్వారా పూర్తి సమాచారం అందించినప్పుడు మాత్రమే జవాబుదారీతనం మరియు పారదర్శకతకు సార్ధకత చేకూరుతుందన్నారు.

గత పది సంవత్సరాల కాలంలో సమాచార కమిషనర్ అందుబాటులో ఉంచకపోవడం వల్ల రాష్ట్రంలో 18 వేల కేసులు సమాచార హక్కు చట్టం కమిషనర్ దగ్గర పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో పెండింగ్లో ఉన్న కేసులను పూర్తిగా పరిష్కరించి కొత్త దరఖాస్తుల ద్వారా ముందుకు వెళ్ళబోతున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రెండు నెలల్లో 30 శాఖల కేసులు పూర్తిగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రజలు సమాచారం కోసం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం అందజేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద సిటిజన్ షార్ట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సరైన కారణాలు చూపించకుండా ఆర్టిఐ యాక్ట్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించకూడదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం అందుబాటులో ఉంది కాబట్టి అధికారులందరూ బాధ్యతగా తీసుకొని త్వరితగతిన తగిన సమాచారం ప్రజలకు అందించాలన్నారు.

సమాచార హక్కు చట్టం పై పౌర సమాచార అధికారులకు అవగాహన పెంపొందించే విధంగా రాష్ట్రంలో 11 జిల్లాలు ఎంపిక చేసుకుని చట్టంలోని సెక్షన్ల పై పూర్తి అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీని ద్వారా ఆర్టిఐ కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చు అన్నారు. అధికారులందరూ ప్రజలకి తగిన సమాచారం అందించేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 17 శాఖల్లో వచ్చే మార్చి లోపు అన్ని కేసులు పరిష్కార మార్గాలు చూపి సమాచారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మరుగున పడిన వ్యవస్థను నూతన ఉత్సాహంతో ముందుకు తీసుకువచ్చి ప్రజలకు ఖచ్చితమైన సమాచారం అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ...**

జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలయ్యే అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని శాఖల అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే విధంగా సమావేశాలు మరియు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి పరిస్థితుల్లోనైనా సమాచారం కావాలని దరఖాస్తు చేసుకున్నప్పుడు నిబంధనలకు లోబడి సమాచారం అందించే విధంగా అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని వివరించారు.

ఈ అవగాహన సదస్సులో భాగంగా పౌర సమాచార అధికారులకు సమాచార హక్కు చట్టంపై ఉన్న సందేహాలను కమిషనర్లు నివృత్తి చేశారు.

జిల్లాకు మొదటి సారిగా విచ్చేసిన సమాచార హక్కు కమిషనర్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శాలువా మరియు మెమొంటోతో సత్కరించారు.

ఈ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు మధు, దామోదర్, అన్ని శాఖల పౌర సమాచార అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

**హైదరాబాద్ పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీకి చెందిన బిక్షపతి గత కొంతకాలంగా అనారోగ్యంలో బాధపడుతున్నారు. స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి మంజూరు అయింది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిక్షపతి కుటుంబ సభ్యులకు ఎల్ఓసి అనుమతి పత్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత, పరంజ్యోతి



**హైదరాబాద్ పెన్ పవర్:**బాధిత కుటుంబానికి పరంజ్యోతి ఆర్థిక సాయం

చేగుంట. చేగుంట మండల కేంద్రానికి చెందిన బండి రాములు తల్లి, బండి ఏలవ్వ మరణించిన విషయం తెలుసుకున్న ఒక సంఘ సేవకులు, కాంగ్రెస్ నాయకులు అయిత పరంజ్యోతి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ ఆర్థిక సాయంగా దహన సంస్కారాల నిమిత్తం పరంజ్యోతి 3000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి రాములు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, సోమరాజు, సొసైటీ డైరెక్టర్ అయిత రఘురాములు, తదితరులు పాల్గొన్నారు

## కులం పేరుతో దుషించవద్దు, చట్ట రీత్యా నేరం

తాసిల్దార్ షేక్ కరీమ్



**హైదరాబాద్ పెన్ పవర్:**కుల,లింగ,వర్ణ వివక్ష,చట్ట రీత్యా నేరమని స్థానిక తహశీల్దార్ షేక్ కరీమ్ అన్నారు నార్సింగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో, పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ షేక్ కరీం, ఎంపీడీఓ ఆనంద్, హెడ్ కానిస్టేబుల్ మురళి, పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం,ప్రతీ నెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవం జరుపుతామని, ప్రజలకు రాజ్యాంగం, కల్పించిన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. మనుష్యులు అందరూ సమానమని, కుల, వర్ణ,వివక్ష,సరి కాదని, భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కును కల్పించిందని అన్నారు. ఒకప్పుడు కుల, వివక్ష,,విర్రవీగేదని, అంటరానితనం, బలహీన వర్గాల బ్రతుకులు దుర్భరం అయ్యేవి అని, భారత రాజ్యాంగం రాసిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అంతటి వారికి కూడా వివక్ష తప్పలేదని అన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయని, ప్రజలు చైతన్యవంతం అయ్యారని, ఇది శుభ పరిణామమని అన్నారు. ప్రతీ ఒక్కరూ తమ హక్కుల పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రాజ్యాంగం మహిళలకు,పురుషులకు,సమాన హక్కులు కల్పించిందని, లింగ, వర్ణ వివక్ష సరి కాదని అన్నారు. కుల, లింగ, వర్ణ వివక్ష చట్ట రీత్యా నేరమని, వివక్ష చూపిన వారి పై చట్ట పరమైన అట్రాసిటీ కేసులను నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఈఓ నాగభూషణం, పంచాయితీ కార్యాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ క్రీడా రంగానికి మంచి భవిష్యత్తు

- నూతన క్రీడా విధానంతో మారనున్న క్రీడారంగ ముఖచిత్రం
- సీఎం రేవంత్ గారి ఆలోచనల ప్రతిరూపమే నూతన క్రీడా విధానం
- రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**హైదరాబాద్ పెన్ పవర్:**సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం 2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంప్లెవ్ పోస్టర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్ద కాలం నుండి విస్మరించబడ్డ క్రీడా రంగము సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగు తోందని అన్నారు.

తాను క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొత్తం మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటము ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు.

దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు ఉద్దేశించబడ్డాయి ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్టంగా పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగా నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధుల తో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

క్రీడా విధానం2025 తెలంగాణ క్రీడా రంగానికి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అందజేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాల ను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా ఇది ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ బాధ్యతలు మరింత విస్తరించబోతున్నాయని

వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గారి కృషి వల్ల తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రమే మారిపోతుందని ఆయన వివరించారు.

ఒక ఏడాదికాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని,

రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరగాలి.

## కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**హైదరాబాద్ పెన్ పవర్:** పాల్వంచ మండలం రేగళ్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ఔషధ నిల్వలు, శుభ్రత, రోగులకు అందిస్తున్న సేవల నాణ్యతను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్నటువంటి ఆపరేషన్ గది మరియు లేబర్ రూమును కలెక్టర్ పరిశీలించి ఆపరేషన్ గదిలో మందులు నిల్వ ఉండటాన్ని గమనించి ఇక్కడ ఎందుకు నిల్వ చేశారు, ఆపరేషన్ థియేటర్ ఉపయోగిస్తున్నారా లేదా అని వైద్యులను ప్రశ్నించారు. వైద్యులు మూడు నెలలకు సంబంధించి మందులను ముందుగా నిల్వ చేసినట్లు తగిన ప్రదేశం లేక ఇక్కడ నిల్వ చేసినట్లు వివరించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ సిబ్బందిని అభినందించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రజల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకం పెరగాలి అని పేర్కొన్నారు.

ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించాలంటే వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తమ విధుల్లో నిబద్ధతతో, సమయపాలన పాటిస్తూ సేవలందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. ఆసుపత్రిలో రోగుల కోసం అవసరమైన రక్తపరీక్షలు, సీజనల్ వ్యాధుల నివారణకు మందుల సరఫరా, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వల్ల వ్యాపించే వ్యాధులు ఎక్కువగా ఉన్నందున తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజల ఆరోగ్యం సంరక్షణలో ఆరోగ్య కేంద్రాల పాత్ర కీలకమని అన్నారు. ఆసుపత్రి రికార్డుల నిర్వహణ, వైద్య సేవల నాణ్యత పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి ఆవరణలో నాటిన మునగ, కరివేపాకు మరియు ఉసిరి చెట్లను కలెక్టర్ పరిశీలించి ఇంకా మిగతా ఖాళీ ప్రదేశంలో కూడా ఈ మొక్కలను నాటాలని సూచించారు.

ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాడవీధుల అభివృద్ధిలో సర్వం కోల్పోయిన చిరు వ్యాపారస్తులను ఆదుకోవాలి....

- దేవస్థాన ఆధ్వర్యంలో వ్యాపార సముదాయాన్ని నిర్మించి ఇవ్వాలి.
- సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు.

**హైదరాబాద్ పెన్ పవర్:**భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన మాడవీధుల అభివృద్ధిలో సర్వం కోల్పోయిన చిరు వ్యాపారస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని దేవస్థానం ఆధ్వర్యంలో వ్యాపార కాంప్లెక్సను నిర్మించి చిరు వ్యాపారస్తులకు తక్కువ ధరలకు అద్దెలకు ఇవ్వాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం రామాలయ మాడవీధుల అభివృద్ధి కోసం కూల్చి వేసిన దుకాణ సముదాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు చిరు వ్యాపారస్తులు కూల్చివేతలతో సర్వం కోల్పోయామని చిన్నచిన్న షాపు లలో అద్దెలకుంటూ రామయ్య ని నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమకు ఇప్పుడు నిలువ నీడ లేకుండా పోతుందని తమ ఆవేదనను మచ్చ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మచ్చ మాట్లాడుతూ భద్రాచలం రామాలయ అభివృద్ధిని ప్రతి ఒక్కరు స్వాగతించాల్సిందేనని అదే సందర్భంలో ఎన్నో ఏళ్లగా రామయ్య ని నమ్ముకుని షాపులను అద్దెలకు తీసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవించే వందలాది కుటుంబాలు ఈరోజు వీధిన పడుతున్నాయని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారులపై ఉందని అన్నారు. మాడవీధులకు ఆటంకం లేకుండా దేవస్థానం ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్సను నిర్మించి చిరు వ్యాపారస్తులకు సాధారణ ధరలకు అద్దెకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఉన్న నిర్మాణాలను కూల్చేసిన అధికారులు ఆ వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని అప్రభావంతో రామయ్య దర్శనానికి వచ్చే యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని వెంటనే ఆ వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఒకటవ వార్డు కన్వీనర్ ధనకొండ రాఘవయ్య అధ్యక్షత వహించగా రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు పార్వతి సంతోష్ కుమార్ డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి అజయ్ కుమార్ ఉపేంద్ర కుంజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



# పలు కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఖమ్మం పట్టణంలో ఇటీవల మరణించిన యల్లంకి వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనంతరం జూలూరుపాడు గ్రామ పంచాయతీ చెందిన నవభూమి, ఆంధ్రప్రభ విలేకరులు మోదుగు ఆదమ్, ప్రభాకర్ తండ్రి మోదుగు రాజయ్య అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఖమ్మం పట్టణంలోని కార్తీక్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారుఈ విషయం తెలుసుకున్న వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు" స్వయంగా ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ క్రమంలో వారి యొక్క యోగ క్షేమాలను గిరిబాబు గారు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జూలూరుపాడు మండలం కొత్తూరు గ్రామ పంచాయతీలోని పెద్ద హరిజనవాడ గ్రామానికి చెందిన గొడ్ల వెంకటేశ్వర్లు ని హాస్పిటల్లో పరామర్శించారు

అనంతరం కొణిజర్ల మండలం ఉప్పలచలక గ్రామానికి చెందిన భూక్యా హరిబాబు గారిని ఖమ్మం పట్టణంలోని ప్రశాంతి హాస్పిటల్లో పరామర్శించారు

ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు చాపలమడుగు రామ్మూర్తి, లకావత్ హేమ్లా, బీఆర్ఎస్ మండల నాయకులు భూక్యా దేవిలాల్ నాయక్, తాళ్లూరి రామారావు, రామకృష్ణ పోతురాజు కృష్ణ మరియు తదితరులు నాయకులు పాల్గొన్నారు

# ఆదివాసి దినోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి కి ఆహ్వానం.

- డిప్యూటీ సీఎం ఛాంబర్ లో కలిసి ఆహ్వాన పత్రికను అందించిన ఐటిడిఎ పిఓ బి.రాహుల్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 09న భద్రాచలం ఐ టి డి ఏ ప్రాంగణంలో జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి హాజరవ్వడానికి ఆహ్వాన పత్రికలు అందించడం జరిగిందని తెలంగాణ డిప్యూటీ సీఎం మరియు ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క అన్నారు. గురువారం సెక్రటేరియట్ లోని ప్రజాభవన్లో డిప్యూటీ సీఎం ఛాంబర్ లో ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్ మరియు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తో కలిసి ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆహ్వాన పత్రిక తో పాటు గిరిజన మ్యూజియం కు సంబంధించిన బుక్ లెట్, ఉద్దీపకం వర్క్ బుక్-2 మరియు కెరీర్ గైడెన్స్ బుక్లెట్లను ఆవిష్కరించిన అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గిరిజన విద్యాసంస్థల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టిన నేపథ్యంలో పిల్లలు వెనుకబడి పోకుండా ఉండేందుకు భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో గిరిజన బాల బాలికల ఉజ్వల భవిష్యత్తుకు భద్రాచలం పిఓ రాహుల్ ఉద్దీపకం వర్క్ బుక్-1 అందుబాటులోకి తెచ్చి సత్ఫలితాలు పొందారని, అలాగే ఈ సంవత్సరం చిన్న తరగతునుండే కాక పై తరగతి వరకు గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసం బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్-2 ప్రవేశపెట్టి విద్యార్థిని విద్యార్థుల విద్యాభ్యాసం మెరుగు పడటానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయ మని అన్నారు. అలాగే పదవ తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థినీ విద్యార్థులు భవిష్యత్తులో వారు అనుకున్నది సాధించడానికి కెరిర్ గైడెన్స్ పరంగా ప్రతి పాఠశాలల్లో వివిధ శాఖల అధికారుల అనుభవాల తో అవగాహన కల్పించడం చాలా సంతోషకరమని, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ గిరిజన విద్యార్థుల పై అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు గుర్తింపు రావడంతో రాష్ట్రంలో ఉన్న అన్ని ఐటీడీఏలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడాని కి గిరిజన సంక్షేమ శాఖ సంకల్పించడం తో ఆయనను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు అన్నారు. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు నేటితరం గిరిజన యువతి యువకులు గిరిజన విద్యార్థినీ విద్యార్థులు తెలుసుకుని ఆచరించే విధంగా గిరిజన మ్యూజియం ఏర్పాటు చేసి భద్రాచలం ఐటిడిఏ పేరును ఖండాంతరాలకు వ్యాపించే విధంగా ప్రయత్నించడం ఆయనకు గిరిజనులపై ఉన్న ప్రేమ అనురాగాలు భక్తి భావాలు ఆయన చేస్తున్న కృషికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా నిబంధనలకు లోబడి లేఔట్ అనుమతులు జారీ....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఎఫ్.టి.ఎల్. బఫర్ జోన్ లలో అనుమతులు ఇవ్వరాదు
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన లేఔట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**హైదరాబాద్ పెన్ పవర్:**పారదర్శకంగా నిబంధనలకు లోబడి లేఔట్ అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం నిర్వహించిన లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు.

పెండింగ్ ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, ప్రతి లే అవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న దరఖాస్తుల ప్రాంతాలను గూగుల్ ఎర్త్ వినియోగిస్తూ కలెక్టర్ గతంలో అక్కడ ఏమైనా నీటి వనరులు ఉన్నాయా వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ లేఔట్ అనుమతులు మంజూరు చేసే సమయంలో నియమ, నిబంధనలు క్షేత్ర స్థాయిలో అనుసరించేలా చూడాలని అన్నారు. నిబంధనల మేరకు ఓపెన్ స్పేస్ తప్పని సరిగా లేఔట్ ఏరియాలో ఉండాలని, లేఔట్ లో గ్రీనరీ చెట్ల పెంపకానికి కేటాయింపులు జరగాలని అన్నారు. లేఔట్ కు అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్లు ఉండాలని అన్నారు. లేఔట్ లో స్ట్రీట్ లైట్స్, సీవరేజి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, ఫైర్ సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ లలో అనుమతులు జారీ చేయడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు.

లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు ఉన్నాయా అని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా సాంకేతికతను వినియోగిస్తూ పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని, మనం జారీ చేసిన అనుమతుల లోని నిబంధనలను అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారా లేదా రెగ్యులర్ పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు.

లేఔట్ లకు డ్రాఫ్ట్ అనుమతులు జారీ చేసిన తర్వాత విద్యుత్ స్తంభాల తరలింపు కోసం ఎన్.పి.డి.సి.ఎల్ డిమాండ్ నోటీస్ అందించాలని, వారం రోజుల వ్యవధిలోగా చెల్లింపులు పూర్తి చేయాలని లేని పక్షంలో డ్రాఫ్ట్ అనుమతులు ఉప సంహరించాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ డెవలపర్లు విద్యుత్ స్తంభాల తరలింపుకై చెల్లింపులు చేసిన వారం రోజుల వ్యవధిలోగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని, దీనిపై ప్రత్యేకంగా ఎన్.పి.డి.సి.ఎల్ ఎస్.ఈ కు లేఖ రాయాలని అన్నారు. విద్యుత్ స్తంభాల తరలింపు ఆలస్యం కావడం వల్ల లేఔట్ తుది అనుమతులు జారీ పెండింగ్ లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. డి.ఎల్.సి కమిటీ లో ఉన్న ఎస్.ఈ. స్థాయి అధికారులు స్వయంగా ధృవీకరించిన డాక్యుమెంట్స్ మాత్రమే సమావేశానికి తీసుకొని రావాలని అన్నారు.

ఖమ్మం జిల్లాలో ఇక నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి డి.ఎల్.సి. సమావేశం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, సుడా సిపిఓ., పంచాయతీ రాజ్ ఈ.ఈ. మహేష్, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, ఇరిగేషన్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సువర్ణాక్షరాలతో లిఖించదగిన పథకం



## మేయర్ పునుకొల్లు నీరజ

**హైదరాబాద్ పెన్ పవర్::**భారతదేశ చరిత్రలోనే ఇందిరమ్మ ఇల్లు పథకం సువర్ణాక్షరాలతో లిఖించదగినదని ఖమ్మం నగరపాలక సంస్థ మేయర్ నీరజ తెలిపారు.

ఖమ్మం నగరం లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ఇంటి ఇంటికి పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ నీరజ మాట్లాడుతూ తుమ్మల నాగేశ్వరరావు జిల్లా సమగ్ర అభివృద్ధి కాక రాష్ట్ర మొత్తం సాగునీటి తాగునీటి వనరుల కల్పనకు అవసరమైన అనేక పథకాలు మంజూరు చేయించారని, నిన్ననే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి జిల్లా సాగునీటి పథకాలపై చర్చించారని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు ఖమ్మం నగరంలో మున్నేరు వరద ముంపు ప్రాంతాలు డ్రైనేజీ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఆమె తెలిపారు. నగరంలో అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని అలాగే సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సకాలంలో ప్రభుత్వం నుంచి అందజేస్తున్నామని ఆమె వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ అభివృద్ధి పథకాలు సకాలంలో అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ వైస్ మేయర్ పాతిమ జోహార్

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రీ టౌన్ ఏరియా కాంగ్రెస్ పార్ట కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్లి ఓబీసీ సేల్ అధ్యక్షుడు బాణాల లక్ష్మణ్ నాయకులు ఎస్ కె మూతర్ కన్న%శీ% ప్రసన్న కృష్ణ, రమేష్ గౌడ్ గజ్జి సూర్యనారాయణ బెడదమ్ సత్యనారాయణ లక్కీ ఉపేందర్ బొమ్మ ఉదయ్ అరవపల్లి శివ గుంజకొండలు వల్లపు రమేష్, బొమ్మ నాగార్జున భరత్ వాసంశెట్టి చందాల రఘు పేరం అజయ్ మాలతి తాళ్లూరి రమాదేవి చల్లా శీను ధారావత్ శివకుమార్ పిల్లలు మరి సతీష్ లక్ష్మణ్ చట్టు మంగా,సాదే శంకర సాయి దివ్య పిడుగు మల్లిఖార్జున్, పిడుగు ఉపేందర్,రాంప్రసాద్, ఎస్ కె.వీరభద్రమ్ పిట్ట రెడ్డి గజ్జి శ్రీను

. సురేష్ నాగేశ్వరావు, నల్లపు శ్రీనివాసరావు బొమ్మగాని సైదులు జట్టబోయిన భద్రం బూరల మనోజ్ అరుణ్ సతీష్ పవన్ ఉపేందర్ రాంబాబు సంజయ్ అబ్బాస్

36 డివిజన్ అధ్యక్షుడు గూడెపు నాగరాజు, తూములూరి నరసింహారావు మాడిశెట్టి మదనమోహన్ గల్లా కృష్ణవేణి, రాకేష్ బ్రూస్ లీ మామిడాల శీను ఏనుగంటి శంకర్ దుగ్గి నరసింహారావు, ఎస్కే జాకీర్ రేగు లింగస్వామి సురేషు, నాగరాజు పాషా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.